నాకు. నా బుర్రలో సుళ్ళు తిరుగుతూన్న ఆలోచన ఒక్కటే-వందరూపాయలు... ఒక్కటంటే ఒక్క వంద... ఎలా సంపాదించాలన్నదే! భార్య అవసరానికో శాలువ కొనిపెట్టలేని భర్త వుండీ ఏం ప్రయోజనం? అలాంటి బతుకు అనవసరం అనిపిస్తోంది.

భోంచేసి పడుకుని తీవ్రంగా ఆలోచిస్తూంటే నా చూపులు సైకిల్ మీద పడ్డాయి. పదేళ్ళుగా నన్ను మోస్తోందది. పోయిన ట్యూబులను మార్చుకునే శక్తిలేక నెలరోజులుగా దానిని మూలకు పడెయ్యాల్సి వచ్చింది. ఆఫీసుకు నడిచి వెళ్ళడమవుతోంది. సైకిల్ని చూస్తూంటే నా బుర్రలో మెరుపు మెరిసింది. మా ఆఫీసు ప్రక్కనున్న తాలూకాఫీసులో పనిచేస్తున్న డఫేదారు గురవయ్య గుర్తుకొచ్చాడు నాకు హఠాత్తుగా. అంతే! నా ఆలోచన ఓ కొలిక్కి వచ్చింది.

మర్నాడు నేను గురవయ్యను కలుసుకోవడమేమిటి, అతను నా సైకిల్ తీసుకుని వంద రూపాయలు అప్పివ్వడ మేమిటి చక చక జరిగిపోయాయి. గురవయ్య నా సైకిల్ కి కొత్త ట్యూబులు వేయించుకుని నేను బాకీ తీర్చేంతవరకు సైకిల్ని తాను వాడుకుంటాడు. తరువాత నేను వంద రూపాయలతో పాటు ట్యూబుల ఖరీదు కూడా తీర్చుకోగానే నా సైకిల్ నా చేతికి వచ్చేస్తుంది. అదే ఇతరుల దగ్గరైతే ఇచ్చిన సొమ్ముకు వడ్డీ కూడా వసూలు చేస్తాడు అతడు. కానీ నేనాతనలాగే క్లాస్ ఫోర్ వాడినన్న కనికరంతో నా దగ్గర వడ్డీ తీసుకోవడం లేదు... నెల్లాళ్ళ నుంచి నడక్కి అలవాటు పడిపోయానేమో సైకిల్ లేని లోటు అంతగా బాధించదు నన్ను.

పది కాగితాలు పది చేతిలో పడటంతో విమానం ఎక్కినట్టుగా వుంది నాకు. ఎప్పుడెప్పుడు ఆఫీసు ముగుస్తుందా, ఎప్పుడు ఇంటికి వెళదామా, నా భార్యను తీసుకుని షాపింగ్ కి వెళదామా అని తెగ ఆత్రుతగా వుంది.

ఆ వేళ శాలువ కొనబోతున్నట్టు చెప్పగానే లాటరీలో ఫస్టు ప్రైజు వచ్చినట్లు ఆనందంతో వుబ్బి తబ్బిబ్బయి పోయింది నా భార్య. సైకిల్ తాకట్టు పెట్టినట్టు చెబితే ఎలా ఫీలయ్యేదో గాని రిపేర్ కిచ్చినట్టు చెప్పాను.

వంట పూర్తిచేసి పని తెమిలి నా భార్య ఇంటి నుంచి బయట పడేసరికి రాత్రి ఎనిమిది అయింది. ఆ రోజు చలి ముదిరినట్లుంది. చెవులకు మఫ్లర్ కట్టుకున్నా తెగ వొణికించేస్తోంది. శాలువా వస్తోందన్న సంతోషంలో ఆ చలిని లెక్క చేయకుండా బయలు దేరింది నా భార్య.

షాపుకు వెళ్ళి అరగంట బేరం చేసి తొంభై అయిదు రూపాయలు పెట్టి శాలువా ఒకటి తీసుకున్నాము. లైట్ చాక్లెట్ కలర్ లో మెత్తగా వున్న ఆ శాలువాను వొంటిపైన కప్పుకున్న నా భార్య వదనంలో సామ్రాజ్యపు పట్టమహిషి వదనంలో సయితం కనిపించని సంతృప్తి, ఆనందం వెల్లివిరుస్తూంటే నా మనసు కెంతో తృప్తిగా వుంది. ఆ శాలువాను నేనే కప్పుకున్నట్టుగా వెచ్చగా, హాయిగా అనిపించింది నాకు.

షాపులోంచి బయటకు వచ్చాము. ఆ సంతోష సమయంలో ప్రక్కనున్న ఇరానీ హోటల్లో వేడివేడిగా టీ త్రాగాలనిపించింది. అనిపించడమేమిటి, టీ త్రాగడమేమిటి క్షణాలలో అయిపోయాయి.

నేను బిల్లు చెల్లిస్తూంటే భుజం నిండుగా కప్పుకున్న కొత్త శాలువాతో ఠీవిగా బయటకు నడిచింది నా భార్య. ఆమె ననుసరించాను సగర్వంగా.

"అమ్మా! చలితో వొళ్ళంతా కొంకర్లు తిరిగి పోతోంది. కాసిని టీ నీళ్ళు పోయించు తల్లీ!" అన్న దీనాలాపనతో అప్రయత్నంగా నా చూపులు అటువైపు పడ్డాయి.

హోటల్ ప్రక్కన ...పేవ్ మెంటు మీద...విపరీతమైన ఆ చలిలో జీవం పోసుకున్న అస్థి పంజరంలా అరవై ఏళ్ల ముదుసలి కడుపులోంచి తన్నుకు వస్తూన్న చలికి పెనుగాలిలో చిక్కుకున్న చిగురుటాకులా గజ గజ వొణికి పోతోంది. చాలీచాలని ఓ చిరుగుల చీరె ముక్క తప్ప మరో గుడ్డలేదు-ఆబడుగు దేహం మీద. ఆమె స్వరం విపరీతంగా కంపిస్తోంది.

ఆ దృశ్యం మా కాళ్లకు బ్రేక్ వేసింది.

ఒంటినిండా గుడ్డలు కప్పుకున్న మాకే ఆ చలిని తట్టుకోవడం అశక్యంగా వుంది. ఒంటికి చుట్ట పెట్టుకున్న ఆ గుడ్డ పేలిక తప్ప అన్యం నాస్తి అయిన ఆ ముసలిదాని దుస్థితి వూహాతీతం! వేడి టీ ఎంత త్రాగితే ఆమె చలి తగ్గుతుంది!?

నా కళ్లలోకి సాభిప్రాయంగా చూసింది నా భార్య. ఆమె కన్నులలో తళుకుమన్న బాధ, ఆవేదనా నా దృష్టిని తప్పించుకోలేదు. డబ్బుల కోసం జేబులో చేయి పెట్టాను నేను.

అంతలోనే—

ఆ ముసలి దాని దగ్గరకు నడిచిన నా భార్య తన వొంటిమీదున్న కొత్త శాలువాను తీసి ఆమె వొంటి నిండా కప్పింది!!

అదిచూసి తెల్లబోయాను నేను...


నిర్ఘాంతపోయిన ముసల్ది శాలువా తెచ్చిన వెచ్చదనం గొంతులో ప్రస్ఫుటమవుతూంటే నా భార్యను మనసారా దీవిస్తోంది.

నా దగ్గరకు వచ్చింది నా భార్య. "ఒంటి నిండా బట్టలు వుండీ చలితో వొణుకుతున్నాం మనం. కనీసం ఒంటి మీద గుడ్డయినా లేని ఆ అభాగ్యురాలు ఎముకలు కొరికే చలిని ఆ వయసులో ఎలా తట్టుకో గలదు చెప్పండి? పాపం, చలితో చచ్చిపోతుందేమోనని..." ఆగి సాభిప్రాయంగా చూస్తూ నా చేయి పట్టుకుంది 'నన్ను నన్ను క్షమిస్తారు కదూ?'

క్షమించడమా?... ఆమెను నెత్తిన పెట్టుకుని వూరేగాలనిపించింది నాకు గర్వంతో! అంతటి విశాల హృదయం ఎందరికుంటుంది? చూస్తూండగానే హిమాలయాలకు ఎదిగిపోయినట్లు అనిపించింది.

ఆ క్షణంలో ఆ శాలువ అవసరం గాని, అందుకోసం నేను పడిన పాట్లుగాని గుర్తుకు రాలేదు నాకు.

ప్రేమానురాగాలతో నా భార్యను కౌగలించుకున్నాను వెచ్చగా.



# క్రికెట్ సీజన్

అదొక స్కూలు. ఆ రోజు స్కూలులో పిల్లలు చాలా తక్కువ సంఖ్యలో వున్నారు. అందుక్కారణం ఆదే రోజున భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య మొదటి క్రికెట్ మ్యాచ్ ఆరంభం కావడమే!

సరిగ్గా ఆ సమయంలో స్కూళ్ళ ఇన్ స్పెక్టర్ ఆ స్కూలుకు హఠాత్తుగా తనిఖీకి వచ్చాడు. వెంటనే ఎదురుగా కనిపించిన క్లాస్ రూంలోకి వెళ్ళి విద్యార్థుల మీద ప్రశ్నల వర్షం కురిపించాడు.

జవాబులు చెప్పలేక విద్యార్థులంతా తెల్లముఖాలు వేశారు. ఒక కుర్రాడ్ని పక్కకు తీసుకువెళ్ళి

"నిజం చెప్పు నీది ఈ క్లాసేనా?" అని గదమాయించాడు.

"క్షమించండి సార్! నాదీ క్లాసు కాదు. మా తమ్ముడు క్రికెట్ మ్యాచ్ చూడడానికి వెడుతూ నన్ను వాడి స్థానంలో వుంచి వెళ్ళాడు. వాడు వచ్చిన తర్వాత నేను వెడతాను" భయపడుతూనే అసలు విషయం చెప్పాడా విద్యార్థి.

పళ్ళు నూరిన ఇన్ స్పెక్టర్ క్లాస్ టీచర్ ని కొరకరా చూస్తూ "మీ సంజాయిషీ కావాలి?" అన్నాడు.

టీచర్ గడగడా వణికిపోతూ "సార్ క్షమించండి. నేను ఈ క్లాసు టీచర్ ని కాను. వీళ్ళ టీచర్ క్రికెట్ చూడడానికి వెళ్ళాడు..." అని నిజం చెప్పాడు.

ఇన్ స్పెక్టర్ కి కోపం నషాళానికంటింది. ప్రధానోపాధ్యాయుడి దగ్గరికి పరుగు తీశాడు.

"నేను హెడ్ మాస్టార్ని కాను. అసలు మాస్టారు మ్యాచ్ చూడ్డానికి వెళ్ళారు" అన్నాడాయన.

ఇన్ స్పెక్టర్ ముఖం చూసిన స్టాఫ్ మెంబర్స్ అంతా భయంతో వణికిపోతున్నారు. ఎర్రగా కంద గడ్డలా అయిపోయిన ఆయన నుంచి ఎలాంటి దూషణాదులను వినాలో అనుకుంటూ గుడ్లప్పగించి చూస్తుండిపోయారు.

ఐదు నిమిషాల మౌనాన్ని భంగపరుస్తూ ఘొల్లున నవ్వేసిన ఆయన. బిక్కముఖం వేసుకున్న స్టాఫ్ తో.

"వండర్ ఫుల్. మీరు లేచిన వేళా విశేషం బాగుంది. ఎందుకంటే నేనూ అసలు స్కూళ్ళ ఇన్ స్పెక్టర్ని కాను. నా ఫ్రెండ్ క్రికెట్ మ్యాచ్ చూడడానికి వెళితేను. నేను సరదాగా ఇటొచ్చి నాటకమాడాను. నిజంగా క్రికెట్ సీజన్ మహత్యం చాలా వుంది".

పెద్దగా నవ్వుతూ చెబుతున్న ఆయన నవ్వులో అందరూ శృతి కలిపారు.

—హిమజారమణ